టైటిల్ నిలబెట్టుకునేనా?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) గత ఎడిషన్‌లో పదేండ్ల విరామం తర్వాత టైటిల్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) తాజా సీజన్‌లో డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. 2024 సీజన్ ఆరంభానికి ముందు అసలు అంచనాలే లేకుండా బరిలో నిలిచిన కోల్‌కతా... టోర్నీ ఆసాంతం ఊపు మీదున్న సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను క్వాలిఫయర్-1తో పాటు ఫైనల్‌లోనూ చిత్తు చేసి మూడో టైటిల్‌ను ఎగురేసుకుపోయింది. 2025లోనూ అదే మ్యాజిక్‌ను రిపీట్ చేసేందుకు డిఫెండింగ్ చాంపియన్స్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నా ఈసారి ఆ జట్టుకు పెను సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. దశాబ్ది విరామం అనంతరం తమకు ట్రోఫీని అందించిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను సైతం పక్కనబెట్టి అతడిని వేలానికి వదిలేసిన కేకేఆర్ యాజమాన్యం.. ఈ ఫార్మాట్‌లో గొప్ప రికార్డేమీ లేని అజింక్యా రహానేకు ఆ బాధ్యతలు అప్పగించింది. మరి అజింక్యా.. అయ్యర్‌ను మరిపిస్తాడా అన్నది చూడాలి.

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

జైత్రయాత్ర కొనసాగాలంటే..

శ్రేయస్‌ను కాదనుకున్న కేకేఆర్ యాజమాన్యం.. వేలంలో మధ్యప్రదేశ్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌ను రూ. 23.75 కోట్ల భారీ ధరతో దక్కించుకోవడంతో అతడికే సారథ్య పగ్గాలు అప్పజెప్పుతారని అంతా భావించారు. కానీ టీమ్ మేనేజ్‌మెంట్ అనూహ్యంగా రహానేను ఆ స్థానంలో నియమించి వెంకటేశ్‌ను అతడి డిప్యూటీగా ఎంపిక చేసింది. ఈ ద్వయం కేకేఆర్ జైత్రయాత్రను ఏ మేరకు ముందుకు తీసుకెళ్తుందనేది ఆసక్తికరం. ఐపీఎల్‌లో చాలాకాలంగా ఆడుతున్నప్పటికీ రహానే.. రంజీలు, ఇతర దేశవాళీ టోర్నీల మాదిరిగా ఈ లీగ్‌లో తనదైన ముద్రను వేయలేకపోయాడు. కానీ గతేడాది ముగిసిన సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో టోర్నీ టాప్ స్కోరర్ (469)గా నిలిచాడు. అతడి బ్యాటింగ్ సగటు కూడా 164.56తో మెరుగ్గానే ఉంది. గత రెండు ఐపీఎల్ సీజన్లలోనూ అతడు మెరుపులు మెరిపించాడు. బ్యాట్‌తో పాటు మైదానంలో సారథిగానూ తన వ్యూహాలతో రహానే సక్సెస్ అయితే ఆ జట్టుకు తిరుగుండదు. 2021 నుంచి కోల్‌కతాకు ఆడుతూ గత సీజన్‌లో 46 సగటుతో 370 పరుగులు చేసిన వెంకటేశ్ మిడిలార్డర్‌లో అత్యంత కీలకం. తనదైన రోజున అతడి విధ్వంసం ఎవరూ ఊహించని స్థాయిలో ఉంటుంది. మిడిలార్డర్‌తో పాటు లోయరార్డర్‌లో దుర్భేధ్యమైన లైనప్ కేకేఆర్ సొంతం. సిక్సర్ల రింకూ సింగ్, హార్డ్ హిట్టర్ ఆండ్రీ రస్సెల్, బంతిని నేలమీద కంటే గాల్లోనే ఎక్కువ ఉంచే మన్‌దీప్ సింగ్ వంటి నాణ్యమైన ఫినిషర్లు కోల్‌కతాకు ఉన్నారు. ఇక భారత చాంపియన్స్ ట్రోఫీలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి నైట్‌రైడర్స్‌కు వెలకట్టలేని ఆస్తి. రెండో ఇన్నింగ్స్‌లో స్పిన్‌కు సహకరించే ఈడెన్ గార్డెన్స్ పిచ్‌పై అతడు అత్యంత ప్రమాదకారి. నరైన్‌కు అండగా వరుణ్ మ్యాజిక్ చేస్తే ప్రత్యర్థులకు చుక్కలే.

పేస్ విభాగం బలహీనం..

బ్యాటింగ్ లైనప్ పటిష్టంగా కనిపిస్తున్నా.. నిరుటి సీజన్‌లో ఓపెనర్‌గా ప్రమోట్ అయి సంచలనాలు సృష్టించిన విండీస్ ఆల్‌రౌండర్ సునీల్ నరైన్ కొంతకాలంగా ఫామ్‌లేమితో తంటాలు పడుతున్నాడు. కొద్దిరోజుల క్రితం ముగిసిన ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో అతడు బ్యాట్‌తో పాటు బంతితోనూ విఫలమయ్యాడు. ఫిల్ సాల్ట్‌ను వదులుకోవడం కేకేఆర్‌కు ఎదురుదెబ్బ. సాల్ట్ లేకపోవడంతో నరైన్‌కు ఓపెనింగ్‌గా గుర్బాజ్, డికాక్‌లో ఎవరు ఆడతారనేది చూడాలి. అన్నింటికీ మించి నిఖార్సైన పేసర్ లేకపోవడం ఆ జట్టుకు భారీ లోటు. స్టార్క్‌ను వేలానికి వదిలేసిన కోల్‌కతా.. దక్షిణాఫ్రికా పేసర్ ఆన్రిచ్ నోకియాను దక్కించుకున్నా తరుచూ గాయాల బారిన పడే అతడి ఫిట్‌నెస్‌పై అనుమానాలున్నాయి. దీంతో ఆ జట్టు పేస్ భారం అంతగా అనుభవం లేని హర్షిత్ రాణాపై పడనుంది. ఆసీస్ సీమర్ స్పెన్సర్ జాన్సన్ రూపంలో ఓ పేసర్ ఉన్నప్పటికీ అతడికి తుది జట్టులో చోటు దక్కుతుందా? అన్నది అనుమానమే.

గంభీర్ లేకుండా సాధిస్తారా?

ఐపీఎల్‌లో తొలిసారి 2012లో టైటిల్ గెలిచిన కోల్‌కతా.. 2014లో రెండోసారి విజేతగా నిలిచింది. ఈ రెండుసార్లూ ఆ జట్టుకు గౌతం గంభీరే సారథి. ఇక నిరుడు మూడోసారి విజేతగా నిలిచినప్పుడు గంభీర్ మెంటార్‌గా కీలకపాత్ర పోషించాడు. కానీ అతడు భారత జట్టుకు హెడ్‌కోచ్‌గా నియమితుడవడంతో ఆ బాధ్యతలను విండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావోకు అప్పగించారు. ఆటగాడిగా అద్భుతమైన రికార్డు కలిగిన బ్రావో.. గంభీర్‌ను ఏ మేరకు మరిపిస్తాడు? అనేది చూడాలి. చీఫ్ కోచ్ చంద్రకాంత్ పాటిల్ కఠినమైన శిక్షణ, అసిస్టెంట్ కోచ్‌గా వెస్టిండీస్ ఆల్‌రౌండర్ గిబ్సన్.. ఆ జట్టు టైటిల్ నిలబెట్టుకునే దిశగా ఏ మేరకు సఫలీకృతం అవుతుందో చూడాలి.

నేటి నుంచే స్విస్ ఓపెన్

బసెల్: రెండ్రోజుల క్రితమే ముగిసిన ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో వైఫల్య ప్రదర్శన చేసిన భారత షట్లర్లు తిరిగి పుంజుకునేందుకు మరో టోర్నీ సిద్ధమైంది. మంగళవారం నుంచి స్విట్జర్లాండ్‌లోని బాసెల్ వేదికగా బీడబ్ల్యూఎఫ్ సూపర్ 300 టోర్నమెంట్ (స్విస్ ఓపెన్) మొదలుకానుంది. 2019లో ఇక్కడే జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్ పోటీలలో బంగారు పతకం గెలిచిన డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధు.. స్విస్ ఓపెన్ ద్వారా మళ్లీ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని భావిస్తోంది. సింధుతో పాటు మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోద్, ఆకర్షి కశ్యప్, అనుపమ ఉపాధ్యాయ బరిలో ఉన్నారు. సింధు తొలి రౌండ్‌లో మాళవికతో పోటీ పడనుంది. సింధు మాదిరిగానే ఇక్కడ మంచి రికార్డు కలిగిన హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్య సేన్, కిరణ్ జార్జి, ప్రియాన్షు రజావత్, కిడాంబి శ్రీకాంత్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.



ఢిల్లీ వైస్ కెప్టెన్‌గా డుప్లెసిస్

ఢిల్లీ: గత రెండు సీజన్లలో ఆర్‌సీబీకి సారథిగా వ్యవహరించిన దక్షిణాఫ్రికా మాజీ కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్.. త్వరలో మొదలుకాబోయే ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు వైస్ కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈ సీజన్‌కు బెంగళూరు అతడిని రిటైన్ చేసుకోకపోవడంతో వేలానికి వెళ్లిన డుప్లెసిస్‌ను ఢిల్లీ రూ.2 కోట్లతో దక్కించుకుంది. ఢిల్లీ ఇదివరకే తమ సారథిగా అక్షర్ పటేల్‌ను నియమించిన విషయం తెలిసిందే. అంతగా కెప్టెన్సీ అనుభవం లేని అక్షర్‌కు డుప్లెసిస్ వంటి అనుభవజ్ఞుడు అండగా ఉండటం జట్టుకు మేలు చేస్తుందని క్యాపిటల్స్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది.

ఉమ్రాన్ మాలిక్ ఔట్



కోల్‌కతా: ఐపీఎల్-18 సీజన్ ఆరంభానికి ముందే కేకేఆర్ పేసర్ ఉమ్రాన్ మాలిక్ సీజన్ నుంచి వైదొలిగాడు. గాయం కారణంగా అతడు సీజన్ మొత్తానికి దూరమైనట్టు కేకేఆర్ తెలిపింది. ఈ సీజన్‌కు ముందు నిర్వహించిన వేలంలో ఉమ్రాన్‌ను రూ.75 లక్షల నామమాత్రపు ధరకు దక్కించుకున్న కేకేఆర్.. అతడి స్థానాన్ని చేతన్ సకారియాతో భర్తీ చేయనుంది.

ఖర్చు 869 కోట్లు.. నష్టం 739 కోట్లు!

పాక్‌కు 'చాంపియన్స్' కష్టాలు

కరాచీ: మూడు దశాబ్దాల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత లేకలేక ఒక ఐసీసీ టోర్నీకి ఆతిథ్యమిచ్చిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ భారీ నష్టాలనే మిగిల్చిందా? అంటే అవుననే అంటున్నాయి పీసీబీ వర్గాలు. ఈ టోర్నీ నిర్వహణకు పీసీబీ రూ.869 కోట్లు పెడితే 85 శాతం నష్టం (రూ.739 కోట్లు) వచ్చినట్లు స్థానిక మీడియా కోడై కూస్తోంది. ఓ నివేదిక ప్రకారం.. ఈ ట్రోఫీలో మ్యాచ్‌లకు ఆతిథ్యమిచ్చిన రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాల పునర్నిర్మాణానికి పీసీబీ సుమారు 18 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. ఇది వారి ప్రతిపాదిత బడ్జెట్ కంటే 50 శాతం అధికం. ఇక ఈవెంట్ సన్నాహకాలు, ఇతరత్రా ఖర్చులకు గాను 40 మిలియన్ డాలర్లు వెచ్చించింది. అయితే ఆతిథ్య దేశానికి హక్కుగా రావాల్సిన హోస్టింగ్ ఫీజుతో పాటు టికెట్ అమ్మకాలు, స్పాన్సర్‌షిప్స్ నుంచి 6 మిలియన్ డాలర్లు మాత్రమే పీసీబీ ఖజానాకు చేరింది. దీంతో పీసీబీపై 85 మిలియన్ డాలర్ల నష్టపోయినట్లు 'డాన్' పత్రిక ఓ కథనంలో పేర్కొంది. అయితే చాంపియన్స్ ట్రోఫీ నష్టాలను పీసీబీ.. ఆ దేశ క్రికెటర్ల మ్యాచ్ ఫీజులను తగ్గించడం ద్వారా పూడ్చుకుంటున్నట్టు కథనాలు వెలువడుతున్నాయి.

హోలీ ఆడటం నేరం

మళ్లీ షమీని టార్గెట్ చేసిన మౌలానా

బరేలి: టీమ్‌ఇండియా స్టార్ పేసర్ మహ్మద్ షమీ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉండటం లేదని, అది పాపమని వ్యాఖ్యానించి వార్తల్లో నిలిచిన ఆలిండియా ముస్లిం జమాత్ అధ్యక్షుడు మౌలానా షహబుద్దీన్ మరోసారి అతడిని టార్గెట్ చేశాడు. ఈసారి మౌలానా.. షమీ కూతురు హోలీ ఆడటాన్ని తప్పుబట్టాడు. ఈ మేరకు ఓ వీడియోలో మౌలానా మాట్లాడుతూ... 'ఆమె (షమీ కూతురు) చిన్న పిల్ల. హోలీ గురించి తెలియకుండా ఆడటం పెద్ద తప్పేమీ కాదు. కానీ తెలిసీ ఆడుతుంటే మాత్రం అది నేరం. నేను షమీ కుటుంబ సభ్యులను ఒక్కటే కోరుతున్నా. షరియత్‌లో లేని వాటిని మీ ఇంట్లో పిల్లలకు దూరంగా ఉంచండి. హోలీ అనేది హిందూవులకు పెద్ద పండుగ. కానీ ముస్లింలు ఆ పండుగకు దూరంగా ఉండాలి. షరియత్ గురించి తెలిసీ హోలీని జరుపుకుంటే మాత్రం అది నేరమే' అని వ్యాఖ్యానించాడు.

హోరాహోరీగా బీఎఫ్ఐ అధ్యక్ష ఎన్నికలు

పోటీ నుంచి తప్పుకున్న అనురాగ్ ఠాకూర్, విజేందర్

ఢిల్లీ: బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) అధ్యక్ష ఎన్నికల రేసు రసవత్తరంగా సాగుతోంది. వరుసగా మూడోసారి అధ్యక్ష పదవిని దక్కించుకోవాలని చూస్తున్న అజయ్ సింగ్‌కు ఈసారి బీఎఫ్ఐ సెక్రటరీ జనరల్ హేమంత కలిట, ఉపాధ్యక్షుడు రాజేశ్ బండారి నుంచి తీవ్ర పోటీ ఎదురవనుంది. బీఎఫ్ఐ అధ్యక్ష రేసులో కేంద్ర క్రీడాశాఖ మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో పాటు మాజీ బాక్సర్ విజేందర్ సింగ్ నిలుస్తారని వార్తలు వచ్చినా ఆదివారం నాటికి ముగిసిన నామినేషన్ల ప్రక్రియలో ఆ ఇద్దరూ తమ దరఖాస్తులను దాఖలు చేయలేదు. దీంతో అజయ్, హేమంత, రాజేశ్ మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. కేరళ స్టేట్ అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ డి. చంద్రలాల్ సైతం ప్రెసిడెంట్ రేసులో పోటీ పడుతున్నాడు. ఈనెల 28న గురుగ్రామ్‌లో నిర్వహించబోయే బీఎఫ్ఐ వార్షిక సాధారణ సమావేశంలో కొత్త అధ్యక్షుడిని ఎన్నుకోనున్నారు.

లాస్‌ఎంజిల్స్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్

కోస్టా నోవారినో(గ్రీస్): బాక్సింగ్ అభిమానులకు శుభవార్త! గత కొన్ని నెలలుగా అనిశ్చితి మధ్య సాగుతున్న అంతర్జాతీయ బాక్సింగ్ వివాదం ఎట్టకేలకు కొలిక్కి వచ్చింది. అంతర్జాతీయ బాక్సింగ్ అసోసియేషన్(ఐబీఏ)ను పక్కకు తప్పిస్తూ వరల్డ్ బాక్సింగ్‌కు ఇప్పటికే ప్రాథమిక గుర్తింపునిచ్చిన ఐవోసీ మరో కీలక నిర్ణయం తీసుకుంది. లాస్‌ఎంజిల్స్(2028) ఒలింపిక్స్‌లో బాక్సింగ్‌కు చోటు కల్పిస్తూ సోమవారం నిర్ణయం తీసుకుంది. మంగళవారం నుంచి మొదలయ్యే ఐవోసీ సెషన్‌కు ముందు బోర్డు..బాక్సింగ్ చేరికకు ఆమోదముద్ర వేసింది.

గచ్చిబౌలి బౌల్డర్‌హిల్స్ వేదికగా శ్రీ ఆదిత్య వాంటేజ్ గోల్ఫ్ టోర్నీ సోమవారం ఘనంగా ముగిసింది. బహుమతి ప్రదాన కార్యక్రమంలో కోటారెడ్డి, జితేందర్‌కుమార్, ఆదిత్యారెడ్డి, విష్ణుకుమార్, మధుసూదన్‌రావు, ఎస్ఆర్ఎస్ రెడ్డి, పాపిరెడ్డి పాల్గొన్నారు.



బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా సోమవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) అన్‌బాక్స్ ఈవెంట్ అట్టహాసంగా జరిగింది. ఆటాపాటల మధ్య సాగిన కార్యక్రమం ఆర్‌సీబీ అభిమానులను అమితంగా ఆకట్టుకుంది.

చిత్రం

పూరి చిత్రానికి గ్రీన్‌సిగ్నల్

కెరీర్ ఆరంభం నుంచి వినూత్న కథాంశాలను ఎంచుకొంటూ విలక్షణ నటుడిగా పేరు తెచ్చుకున్నారు తమిళ అగ్ర నటుడు విజయ్ సేతుపతి. గత ఏడాది 'మహారాజా' చిత్రంలో ఆయన అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కాయి. తాజా సమాచారం ప్రకారం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఆయన ఓ చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. పూరి చెప్పిన కాన్సెప్ట్‌లోని కొత్తదనం, తన పాత్రను డిజైన్ చేసిన విధానం నచ్చడంతో విజయ్ సేతుపతి ఈ సినిమాకు వెంటనే అంగీకరించారని చెబుతున్నారు. కథ బాగా ఇంప్రెస్ చేయడంతో వెంటనే ఈ సినిమాను పట్టాలెక్కించాలని ఆయన పూరి జగన్నాథ్‌ను కోరినట్లు వార్తలొస్తున్నాయి. ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడుతుందని సమాచారం. ప్రస్తుతం విజయ్ సేతుపతి 'ట్రెయిన్' అనే చిత్రంతో పాటు పాండిరాజ్ దర్శకత్వంలో కూడా ఓ సినిమా చేస్తున్నారు.

'12ఏ రైల్వే కాలనీ'లో ఏం జరిగింది?

గత కొన్నేళ్లుగా వైవిధ్యమైన కథాంశాలను ఎంచుకొని ప్రేక్షకుల్ని మెప్పిస్తున్న హీరో అల్లరి నరేష్ మరో యూనిక్ కాన్సెప్ట్‌తో రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి '12ఏ రైల్వే కాలనీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. నాని కాసరగడ్డ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'పొలిమేర' ఫేమ్ డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. శ్రీనివాసా చిట్టూరి నిర్మాత. సోమవారం టైటిల్‌తో పాటు టీజర్‌ను విడుదల చేశారు. అల్లరి నరేష్ ఓ కిటికీ దగ్గర నిల్చొని దీర్ఘాలోచనలో కనిపిస్తున్న సన్నివేశంతో ఆరంభమైన టీజర్ ఉత్కంఠను పంచింది. కొంతమందికి మాత్రమే ఆత్మలు ఎందుకు కనిపిస్తాయి? జరగబోయే అతీంద్రియ సంఘటనల వెనక ఎలాంటి కారణం ఉంటుందనే ప్రశ్నలతో టీజర్ ఆసక్తికరంగా సాగింది. చివరగా అల్లరి నరేష్ ఒక వ్యక్తిని చంపి నవ్వుతుండటం ఆయన పాత్రపై మరింత ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసేలా ఉంది. ఈ వేసవిలో చిత్రాన్ని విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: పవన్‌కుమార్, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, షోరన్నర్: డాక్టర్ అనిల్ విశ్వనాథ్, దర్శకత్వం: నాని కాసరగడ్డ.

100 కోట్ల ఖరీదైన ఇల్లు

ఈ మధ్య సినిమాలు బాగా తగ్గించింది అగ్ర కథానాయిక నయనతార. ప్రస్తుతానికైతే కుటుంబం కోసమే ఎక్కువ సమయాన్ని కేటాయిస్తున్నది. దాదాపు 15ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎన్నో సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నయనతార భాగమైంది. ముఖ్యంగా మహిళా ప్రధాన కథాంశాలతో ప్రేక్షకులకు చేరువైంది. ఈ క్రమంలో తన సమకాలీన కథానాయికల కంటే నయనతార భారీ మొత్తంలో డబ్బును ఆర్జించిందని చెబుతారు. తాజాగా ఆమె 100కోట్లతో చెన్నైలో ఓ విలాసవంతమైన గృహాన్ని కొనుగోలు చేసింది. చెన్నైలో ప్రముఖులు ఉండే పోయెస్ గార్డెన్‌లో భర్త విఘ్నేష్ శివన్‌తో కలిసి ఆమె ఈ ప్రాపర్టీ కొనుగోలు చేసిందని తెలిసింది. దాదాపు మూడంతస్తులు ఉన్న ఈ భవనంలో మొదటి ఫ్లోర్ మొత్తం స్టూడియో కోసం కేటాయించారట. మిగతా రెండు ఫ్లోర్‌లలో అధునాతన సౌకర్యాలతో విలాసవంతంగా ఇంటిని సిద్ధం చేశారట. ఇంటీరియర్ డిజైన్స్‌కే పెద్ద మొత్తంలో వెచ్చించారని తెలుస్తున్నది. ప్రస్తుతం ఈ ఇంటికి సంబంధించిన ఫొటోలు సోషల్‌మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

20ఏండ్ల పాటు గుర్తుండిపోతుంది

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా విజయశాంతి కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. ప్రదీప్ చిలుకూరి దర్శకుడు. అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మాతలు. సోమవారం టీజర్‌ను విడుదల చేశారు. ఐపీఎస్ ఆఫీసర్ విజయశాంతి విధి నిర్వహణలో నేరస్థులను ఎదుర్కొనే సన్నివేశాలతో టీజర్ ఆరంభమైంది. వైజాగ్‌లో నేరాలను నియంత్రించడంలో పోలీసులు విఫలమవడంతో అర్జున్ రంగ ప్రవేశం చేస్తాడు. ఈ నేపథ్యంలో టీజర్ ఆసక్తికరంగా సాగింది. చాలా రోజుల తర్వాత పవర్‌ఫుల్ యాక్షన్ ఘట్టాల్లో భాగమయ్యే అవకాశం దక్కిందని, ఆ సన్నివేశాలన్నీ సహజంగా అనిపిస్తాయని, తన అభిమానులకు ఫుల్‌మీల్స్‌లాంటి సినిమా ఇదని విజయశాంతి చెప్పారు. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ ''కర్తవ్యం' సినిమాలో వైజయంతికి కొడుకు పుడితే ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయన్నదే ఈ సినిమా కథ. నా కెరీర్‌లో 'అతనొక్కడే' సినిమా ఎప్పటికీ గుర్తుంటుంది. అదే తరహాలో ఈ సినిమా కూడా 20ఏళ్ల పాటు గుర్తుండిపోతుంది. స్త్రీమూర్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వారి కోసం మనం ఎలాంటి త్యాగం చేసినా సరిపోదనే సందేశంతో ఈ సినిమా ఆకట్టుకుంటుంది' అన్నారు. విజయశాంతిగారు ఒప్పుకుంటేనే ఈ సినిమా చేద్దామనుకున్నామని, ఆమె అంగీకారంతోనే ఈ ప్రాజెక్ట్ ముందుకెళ్లిందని దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెలిపారు. ఈ సినిమాకు విజయశాంతిగారు ఆయువుపట్టులా నిలిచారని నిర్మాత సునీల్ బలుసు అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, రచన-దర్శకత్వం: ప్రదీప్ చిలుకూరి.

డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'

ఆది సాయికుమార్, అవికాగోర్ జంటగా నటిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'షణ్ముఖ'. షణ్ముగం సాప్పని దర్శకుడు. ఈ నెల 21న ప్రేక్షకుల ముందుకురానుంది. ఆదివారం నిర్వహించిన ప్రీరిలీజ్ వేడుకను ఎంపీ రఘునందన్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాలా మంది టైటిల్ పాజిటివ్‌గా ఉందని చెప్పారని, ప్రేక్షకులకు విభిన్న కథా చిత్రాన్ని చూసిన అనుభూతిని మిగుల్చుతుందని హీరో ఆది సాయికుమార్ తెలిపారు. తన డ్రీమ్ ప్రాజెక్ట్ ఇదని, ఫ్యామిలీ అంతా కలిసి చూసే డివోషనల్ థ్రిల్లర్‌గా మెప్పిస్తుందని, రవి బస్రూర్ సంగీతం హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు షణ్ముగం సాప్పని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: రవి బస్రూర్, నిర్మాతలు: తులసీరామ్, షణ్ముగం, రమేష్ యాదవ్, దర్శకత్వం: షణ్ముగం సాప్పని.

వేసవిలో వినోదాల జల్లు



ఇటీవల విడుదలైన 'కోర్ట్' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు ప్రియదర్శి. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'సారంగపాణి జాతకం'. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకుడు. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 18న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇంటిల్లిపాదినీ కడుపుబ్బా నవ్వించే చిత్రమిదని, ఆద్యంతం చక్కటి హాస్యంతో మెప్పిస్తుందని, ఇటీవల విడుదలైన టీజర్‌లో సారంగపాణి ప్రపంచాన్ని ఆవిష్కరించామని నిర్మాత పేర్కొన్నారు. వేసవిలో వినోదాల జల్లులా ప్రేక్షకుల్ని మెప్పించే చిత్రమిదని దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి తెలిపారు. రూప కొడువాయూర్, నరేష్ విజయకృష్ణ, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్‌సాగర్, రచన-దర్శకత్వం: మోహనకృష్ణ ఇంద్రగంటి.

మాట్లాడే స్కూటర్ కథ



'ఓ వాహనానికి ప్రాణం, భావోద్వేగాలు ఉంటే ఎలా ఉంటుందనే ఆలోచన నుంచే ఈ కథ పుట్టింది. మనలాగే ఆలోచించగలిగే ఓ స్కూటర్ నేపథ్యంలో కథ నడుస్తుంది' అని చెప్పారు సుప్రీత్‌కృష్ణ. ఆయన దర్శకత్వంలో హర్ష రోషన్, కార్తికేయ, స్టీవెన్ మధు, సాన్వీ మేఘన, నిహాల్ కోదాటి ప్రధాన పాత్రల్లో నటించిన 'టుక్ టుక్' చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు సుప్రీత్‌కృష్ణ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు తెలియజేశారు. చిత్తూరు నేపథ్యంలో 90స్ నుంచి 20 దశకం వరకు కథ నడుస్తుందని, ముగ్గురు టీనేజ్ అబ్బాయిల దగ్గరకు టుక్ టుక్ అనే వెహికల్ ఎందుకు వచ్చింది? దానితో వారికి ఎలాంటి బాండ్ ఏర్పడిందన్నది కథలో ఆసక్తికరంగా ఉంటుందని సుప్రీత్‌కృష్ణ తెలిపారు. మనం ఏ ప్రశ్న అడిగినా స్కూటర్ తనదైన శైలిలో సమాధానం చెబుతుందని, మ్యాజికల్, ఫాంటసీ అంశాలతో ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచుతుందని, ఈ సినిమాకు సీక్వెల్ కూడా చేసే ఆలోచన ఉందని ఆయన చెప్పారు.

అశ్వారావుపేటలో రాబిన్‌హుడ్ సందడి

హీరో నితిన్ నటించిన 'రాబిన్ హుడ్' సినిమా కచ్చితంగా బ్లాక్ బస్టర్‌గా నిలుస్తుందని చిత్ర నిర్మాత వై.రవిశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలోని గుబ్బల మంగమ్మ ఆలయాన్ని సోమవారం హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుములతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీన ప్రపంచవ్యాప్తంగా చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అశ్వారావుపేటకు చెందిన తాను స్వశక్తితో దర్శకుడిగా మంచిపేరు తెచ్చుకున్నానని, ఇప్పటికే 'ఛలో', 'భీష్మ' చిత్రాలతో ఇండస్ట్రీలో గుర్తింపు లభించిందని వివరించారు. మూడో సినిమా 'రాబిన్ హుడ్'కు ప్రేక్షకులు ఆదరణ తప్పకుండా లభిస్తుందని, వినోదంతో కూడిన ఒక మంచి మెసేజ్ సినిమాలో ఉంటుందని గ్యారంటీ ఇచ్చారు. చిరంజీవితోనూ సినిమా ఉంటుందని, 'రాబిన్ హుడ్' విడుదల తర్వాత చిరంజీవిని కలువనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా హీరో నితిన్ భక్తులతో కలిసి సందడి చేశారు. అందరితోనూ సెల్ఫీలు దిగారు.

అద్భుతాల కోసం ఎదురుచూడొద్దు!

నటుడు విజయ్‌వర్మతో తమన్నా బ్రేకప్ వార్త ఇప్పుడు బాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. గత రెండేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట ఇటీవలే విడిపోయారంటూ వార్తలొస్తున్నాయి. వృత్తిపరమైన అంశాల కారణంగా ఈ జంట మధ్య విభేదాలు తలెత్తాయని తెలుస్తున్నది. ఇటీవల ముంబయి రవీనాటాండన్ నివాసంలో జరిగిన హోలీ వేడుకల్లో కూడా ఈ జంట విడివిడిగానే కనిపించారు. దీంతో ఈ జంట బ్రేకప్ నిజమేనని అభిమానులు నిర్ధారణకు వచ్చారు. ఈ నేపథ్యంలో తమన్నా పెట్టిన తాజా పోస్ట్ ఆసక్తికరంగా మారింది. ఎప్పుడూ తన వృత్తిపరమైన ఫొటోషూట్స్‌ను షేర్ చేసే తమన్నా ఓ సందేశాత్మక కోట్‌ను పోస్ట్ చేయడం విశేషం. జీవితంలో అద్భుతాలు జరుగుతాయని ఎదురుచూడొద్దని, మనమే వాటిని సృష్టించుకోవాలంటూ తమన్నా తన సందేశంలో పేర్కొంది. బ్రేకప్ బాధ నుంచి ఉపశమనంగా ఆమె ఈ పోస్ట్ పెట్టిందని అభిమానులు భావిస్తున్నారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో 'ఓదెల-2' చిత్రంలో నటిస్తున్నది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.